# 4

# దైవారాధనయే దేశాన్ని రక్షిస్తుంది

**దైవాధీనం జగత్సర్వం సత్యాధీనంతు దైవతమ్**

**తత్ సత్యముత్తమాధీనం ఉత్తమః పరదేవతా.**

**"దైవాధీనం జగత్సర్వం." ఈ ప్రపంచమంతయు దైవాధీనమై ఉన్నది. "సత్యాధీనంతు దైవతమ్." దైవము సత్యముయొక్క అధీనములో ఉన్నాడు. "తత్సత్యం ఉత్తమాధీనం." అట్టి సత్యము ఉత్తములయొక్క అధీనములో ఉన్నది. "ఉత్తమో పరదేవతాః" అట్టి ఉత్తముడే దైవస్వరూపుడు.**

*ప్రేమస్వరూపులారా!* దైవాన్నిగూర్చి పరిపూర్ణ జ్ఞానం లేని ఆ రోజుల్లో మన ప్రాచీనులు అనేక విధములుగా విచారణ సల్పి, దైవమంటే ఎవరో నిర్ణయించుకోలేక ప్రకృతిని ఆరాధిస్తూవచ్చారు. కాని, కాలం గడిచేకొలదీ ప్రకృతి ఆరాధన సన్నగిల్లి మూర్తి ఆరాధన అభివృద్ధి అయింది. జన్మించిన ప్రతి ప్రాణీ మూర్తిస్వరూపమే. తల్లిని, తండ్రిని, గురువును, పెద్దలను పూజించడం, గౌరవించడంలో తప్పేమున్నది? వీరంతా మూర్తిస్వరూపులే కదా! అయితే, ఈ మూర్తులలో చైతన్యమున్నది; దయ, ప్రేమ, కరుణ, సహనం, సానుభూతి ఇత్యాది ఆచరణలో ఉన్న సద్గుణాలున్నాయి. దీనిని ఎవ్వరూ కాదని చెప్పలేరు. అయితే, శిలారూపములలో చైతన్యము లేదు, ప్రేమ లేదు, ఆనందము లేదు. అట్టి జడస్వరూపాలను ఆరాధన చేయడాన్ని అనేకమంది వ్యతిరేకిస్తూ వచ్చారు. ఐతే, విగ్రహారాధనను వ్యతిరేకించడం ఒకవిధమైన అజ్ఞానమే. *(టేబుల్‌పై ఉన్న ఒక పుష్పాన్ని వ్రేలు పెట్టి చూపిస్తూ)* ఇదొక పుష్పము. ఇదొక టంబ్లరు. ఇది పుష్పమని, ఇది టంబ్లరని ఈ వ్రేలు మనకు చూపుతున్నది. చూపేంతవరకు మాత్రమే ఈ వ్రేలుపై మన దృష్టి పోతుంది. పుష్పాన్ని, టంబ్లర్‌ను చూసిన తరువాత మన దృష్టి వాటిపైకే పోతుందిగాని, ఈ వ్రేలిపైకి పోదు. అదేవిధంగా, విగ్రహాలు వ్రేలితో చూపినట్లుగా దైవాన్ని చూపుతాయి. దైవాన్ని చూసిన తరువాత ఈ విగ్రహాలు మనకు అక్కర్లేదు. అలాంటప్పుడు విగ్రహారాధనను విమర్శించడం దోషం కాదా? మీరు మీ తాత, ముత్తాతల చిత్రపటాలను మీ గృహాలలో ఉంచుకొని ఎంతో ప్రీతిగా ఆరాధన చేస్తారు. మరి వాటిలో చైతన్యమున్నదా? కరుణ ఉన్నదా? ప్రేమ ఉన్నదా? లేదు. అయినప్పటికీ వాటిని పూజించడంలో ఉన్న అంతరార్థమేమిటి? మన పెద్దలు మన కందించిన ఆదర్శాలను అవి మనకు గుర్తుచేస్తాయి. కనుకనే, చైతన్యము లేకపోయినప్పటికీ వారి చిత్రపటాలను మనము ఆరాధన చేస్తున్నాము. ఆరు ఇంచిల పొడవు, మూడించిల వెడల్పున్న నూరు రూపాయల నోటులో చైతన్య మున్నదా? ప్రేమ ఉన్నదా? లేదు. అయినప్పటికీ మానవుడు దానిని ప్రేమిస్తున్నాడు కదా! నూరు రూపాయల నోటును ద్వేషించేవాడు జగత్తులో కానరాడు. ఏ కాలమువాడైనా, ఏ ప్రాంతమువాడైనా ప్రతి వ్యక్తి డబ్బును ఆశించేవాడేగాని, ద్వేషించేవాడు లేడు. రూపాయల కోసం ప్రాణాలను త్యాగం చేసిన వారెంతమంది లేరు! ధన సంపాదనకోసం తమ జీవితాన్నే ధారపోసేవారెంతమంది లేరు! నూరు రూపాయల నోటుకు ఎందుకింత విలువనిస్తున్నారు? దాని మీదున్న గవర్నమెంటు ముద్రయే దాని విలువకు కారణం. మనము జాతీయపతాకము నెంతో గౌరవిస్తున్నాము. అది కేవలం జడమైన గుడ్డయే కదా! మరి దానినెందుకు గౌరవించాలని ఎవరైనా వాదిస్తారా? జడమైన విగ్రహాలను ఆరాధించడం మూర్ఖత్వమని వాదించే మూర్ఖులు జాతీయపతాకమును

ఆరాధించడం లేదా? నూరు రూపాయల నోటును ప్రేమించడం లేదా? మానవుడు తన ఇష్టాయిష్టాలను పురస్కరించు కొనియే ఒకదానిని పూజిస్తున్నాడు, మరొకదానిని ద్వేషిస్తున్నాడు.

## సకలైశ్వర్యస్వరూపమే ఈశ్వరత్వము

మానవుడు మొట్టమొదట "ఈశావాస్య మిదం జగత్", "ఈశ్వర స్సర్వ భూతానాం" అనే విశ్వాసాన్ని అభివృద్ధిపరచుకోవాలి. ప్రతి జీవి ఈశ్వరస్వరూపమే. ఈశ్వరత్వము అన్ని జీవులందు చైతన్యస్వరూపమై సంచరిస్తున్నది. ప్రతి మానవునియందు ఈశ్వరత్వం తాండవమాడుచున్నది. ఈశ్వరుడనగా సకలైశ్వర్యస్వరూపుడు. ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, శక్తి, జ్ఞానము, వైరాగ్యం అనే షడైశ్వర్యములతో కూడినవాడే ఈశ్వరుడు. 'శంకర' అనేది ఈశ్వరునికి మరొక పేరు. 'శం' అనగా చిదానందము, ఆత్మానందము. 'కర' అనగా అందించేవాడు. ఆత్మానందమును, చిదానందమును అందించేవాడే శంకరుడు. 'సత్యసాయి' అనే పదముయొక్క అంతరార్థమేమిటి? 'సత్య' అనగా ఋగ్వేదమని అర్థము. 'సా' అనగా సామవేదము, 'అ' అనగా అథర్వణ వేదము, 'య' అనగా యజుర్వేదము. కనుక, సర్వవేదముల సారమే ఈ సత్యసాయి.

లింగమనగా గుర్తు అని అర్థం. లింగాకారము ఆత్మకు మాత్రమే సంబంధించినది. లింగాకృతిలో ముఖము ఎటో, కాళ్ళు ఎటో చెప్పడానికి వీలుకాదు. కనుక, ఆద్యంతములు లేని భగవ త్స్వరూపానికి లింగము చిహ్నము. సకలైశ్వర్యస్వరూపమే ఈశ్వరత్వం. మన బుద్ధి, జ్ఞానము, ఆరోగ్యము, సంపద, విద్య ఇవన్నీ ఈశ్వరత్వానికి సంబంధించినవే. ఈ ప్రపంచంలో మనకు కనిపించేదంతా ఈశ్వరత్వమే. ఈశ్వరుడు హృదయవాసి. కరుణతో కూడినదే హృదయము. కనుక, కరుణా స్వరూపమైన తత్త్వమే ఈశ్వరత్వము. ఇట్టి దివ్యమైన ఈశ్వరత్వాన్ని మానవుడు అర్థం చేసుకోలేకపోతున్నాడు. ఈనాడు ప్రపంచంలో అనేక విధములైన ఆరాధనలు జరుగుతున్నాయి. అయితే, ఈ ఆరాధనలన్నీ ఒకే దివ్యత్వానికి చెందుతాయి. రాముడన్నా, కృష్ణుడన్నా, ఈశ్వరుడన్నా ఒక్కటే. కొంతమంది ఈశ్వరుణ్ణి గాఢంగా విశ్వసిస్తారు. మరికొంత మంది రాముణ్ణిపూజిస్తారు. పేర్లు వేరువేరుగాని, దివ్యత్వం ఒక్కటే.

## జడమునందు కూడా చైతన్యమున్నది

విగ్రహారాధన మూర్ఖత్వమని భావించరాదు. అదియే నిజమైన మూర్తిని దర్శింపజేసేది. ఇది పుష్పమని ఈ వ్రేలు చూపుతున్నది. చూపబడినది పుష్పము, చూపించేది వ్రేలు. అదేరీతిగా, చూపబడేది దైవము, చూపించేది విగ్రహము. కాబట్టి, విగ్రహారాధనను విస్మరించరాదు. విగ్రహాలు జడమైనవని భావించరాదు. మీ దృష్టిలో అవి జడమైనవి కావచ్చుగాని, వేదముయొక్క దృష్టిలో అంతా చైతన్యమే. జడమునందుకూడా చైతన్య మున్నది. ప్రతి అణువునందు చైతన్యమున్నది. సర్వ రూపములందు చైతన్యశక్తి ఉన్నది. "అణో రణీయాన్ మహతో మహీయాన్" అణువునుండి ఘనమువరకు చైతన్యం వ్యాపించి యున్నది. సర్వత్రా వ్యాపించిన చైతన్యము ఎందుకు కనిపించడం లేదు? అని మీరు ప్రశ్నించవచ్చు. క్షీరములో వెన్న అణువణువునా వ్యాపించియున్నది. కాని, కోరినంతమాత్రాన అది లభిస్తుందా? లేదు. క్షీరమును పెరుగుగా చేసి చిలికినప్పుడే వెన్న లభ్యమౌతుంది. అదేరీతిగా, ఆత్మసాక్షాత్కారము కావాలంటే దానికి తగిన సాధన చేయాలి. అట్టి సాధన చేయకుండా ఆత్మ మనకు కనిపించడం లేదే, అనుకోవడం చాలా పొరపాటు.

## పరుల దోషాలను వెతికేవాడు మహాపాపి

సర్వమానవులందున్న చైతన్యమే ఆత్మస్వరూపం. ఈ సత్యాన్ని గుర్తించనీయకుండా మానవుణ్ణి రెండుదోషములు వెంటాడుతుంటాయి.

దైవభావంబు హృదయాన తలపనీక
రెండు దోషాలు వెంటాడుచుండు నరుని
తనదు లక్షల దోషాలు దాచుకొనుచు
పరుల దోషంపు నలుసును బయటపెట్టు

తనలో ఉన్న లక్షలాది దోషాలను కప్పిపుచ్చుకొని, పరులలోని అణు మాత్రమైన దోషాన్ని పెద్దదిగా భావిస్తుంటాడు. ఈ రెండు దుర్గుణములను తన హృదయమునుండి తొలగించుకున్నప్పుడు నిజంగా తానే దైవస్వరూపుడు కాగలడు. పరుల దోషాలను వెతకడం చాలా పొరపాటు. తన దోషాలను తాను వెతుక్కోవాలి. తన దోషము చిన్నదైనా దానిని పెద్దదిగా భావించి వెంటనే సరిదిద్దుకోవాలి. పరుల దోషములు పెద్దవిగా కనిపించినా వాటిని పట్టించుకోకూడదు. సాధకునకు త్యాగభావం అత్యవసరం. త్యాగమే యోగము. ఈనాడు ప్రపంచంలో ఎందు చూసినా పరుల దోషాలను వెతికే పాపులు దినదినానికీ పెరిగిపోతున్నారుగాని, తమలో ఉన్న దోషాలను గుర్తించుకొని సరిదిద్దుకొనేవారు ఎక్కడా కనిపించడం లేదు. కనుకనే, మానవుడు అశాంతికి, దుఃఖానికి గురి అవుతున్నాడు. దుఃఖాన్ని దూరం చేసుకొని శాంతిని అనుభవించగోరే మానవుడు మొట్టమొదట తన యందున్న దోషాలను నిర్మూలించుకోవాలి. పరుల దోషాలను వెతికేవాడు మహాపాపి. పరదూషణ మహాపాపం. కాబట్టి, మనం దాని జోలికి పోకూడదు. ఒకవేళ దూషించుట నీకు ఇష్టమైతే, నిన్ను నీవు దూషించుకో. "నేను మానవుడనై పుట్టి మానవుడు చేయవలసిన పనులు చేస్తున్నానా?" అని ప్రశ్నించుకో. నిన్ను నీవు విమర్శించుకో, దూషించుకో, దండించుకో. ఇదియే నిజమైన సాధన. సాధన అనగా జపం చేయడం కాదు, ధ్యానం చేయడం కాదు. నీలో ఉన్న దోషాలను దూరం చేసుకోవడమే నిజమైన సాధన. దుర్గుణాలను దూరం చేసుకొని సద్గుణాలను పెంచుకోవడమే సరియైన సాధన. 'సా' అనగా సకలైశ్వర్య స్వరూపమైన ఈశ్వరత్వం. అదియే మన ధనము. కొంతమందికి క్షణంలో క్రోధము వస్తుంది. ఇది చాలా చెడ్డగుణం. ఎవరి క్రోధం వారినే చంపి వేస్తుంది. "తన కోపమె తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష, దయ చుట్టంబౌ, తన సంతోషమె స్వర్గము, తన దుఃఖమె నరకము..."

**బాహ్యదృష్టి పశులక్షణం, అంతర్దృష్టి మానవలక్షణం**

ఈనాటి మానవుడు తన దోషాలను తాను గుర్తించుకోలేక పోవడంచేతనే నిరంతరం దుఃఖంలో మునిగిపోతున్నాడు. తాను గొప్పవాడినని, పరులు అల్పులని, అమాయకులని అనుకోవడం చాలా పొరపాటు. ప్రతి మానవునియందు, ప్రతి ప్రాణియందు దైవత్వ మున్నది. లేకపోతే "ఈశ్వర స్సర్వ భూతానాం" అని ఎందుకు చెబుతారు? "దైవం మానుష రూపేణ". కనుక, మనం మనుష్యులను దైవస్వరూపులుగా భావించుకుంటే ఇంక ఎవ్వరినీ విమర్శించము. భగవంతుడు భావాన్ని చూస్తాడేగాని, బాహ్యమైన చర్యలను చూడడు. భగవంతుడు భావప్రియుడు. కాని, మానవుడు బాహ్యమైన చర్యలపైనే దృష్టి పెడుతున్నాడు. "పశ్యతీతి పశుః" బాహ్యదృష్టి కల్గినది పశువు, అంతర్దృష్టి కల్గినవాడు మానవుడు. పశువు పచ్చని గడ్డి ఎక్కడ కనపడితే అక్కడికి వెంటనే పరుగెడుతుంది. అది పంట భూమియా? దానికి కాపలావాడున్నాడా? అక్కడికి వెళితే తనను దండిస్తాడేమో అనే విచారణ ఉండదు దానికి. మానవుడు ఏ పనైనా చేయడానికి ముందు దాని మంచిచెడ్డలనుగూర్చి విచారణ చేయాలి. తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. కాని, ఈనాటి మానవుడు తన కర్తవ్యాన్ని విస్మరిస్తున్నాడు. ఇదే మానవునిలో ఉన్న పెద్ద దోషము. మనం ఒక ప్లేనులోనో లేక ఒక బస్సులోనో ప్రయాణం చేయాలనుకున్నప్పుడు అవి సకాలమునకు రాకపోతే వాటినెంత దూషిస్తాము! అదేరీతిగా, మానవుడుకూడా తన కర్తవ్యాన్ని సరిగా నిర్వర్తించనప్పుడు దూషణకు గురి అవుతాడు. మానవుడు తన కర్తవ్యాన్ని గుర్తించుకోవడం లేదు, తన పవిత్రతను

కాపాడుకోవడం లేదు. అందువల్లనే మానవత్వం మట్టిగలసిపోయింది. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనే మానవతా గుణములను అభివృద్ధిపరచుకోనివాడు మానవుడెలా కాగలడు? ఈ మానవతా గుణములే మానవుని పంచప్రాణములు. మానవునిలో సత్యమే లేకపోతే ఒక ప్రాణము పోయినట్లే. ధర్మము కూడా లేకపోతే రెండు ప్రాణములు పోయినట్లే. ఈరీతిగా, మానవతా గుణములను చంపుకోవడం ద్వారా మానవుడు తనను తానే చంపుకుంటున్నాడు. సత్యము నాలుకకు ప్రాణం. ధర్మము చేతికి ప్రాణం. అహింస హృదయానికి ప్రాణం.

**అణకువ 'శివం' - అహంకారం 'శవం'**

శివరాత్రి అనగా మంగళకరమైన రాత్రి. శివమనగా మంగళకర మైనదని అర్థం. మన శ్వాసయే శివత్వం. అదియే "సోహం". అదియే ఆత్మ చేసే శబ్దము. దీనికే 'హంసగాయత్రి' అని పేరు. 'సో' అనగా దైవము, 'హం' అనగా 'నేను'. మన శ్వాస దినమునకు 21,600 పర్యాయములు 'సోహం' (నేనే దైవం) అనే సత్యాన్ని బోధిస్తున్నది. శివమునకు అణకువ అని ఒక అర్థమున్నది. 'శి' అనే అక్షరానికున్న గుడి ( ి ) అణకువకు చిహ్నం. దానికి కిరీటం మాదిరి ఒక తలకట్టు ( ✓ ) పెడితే అది 'శవం' అయిపోతుంది. అది అహంకారానికి సంకేతం. ఈనాటి మానవుడు అహంకారమనే 'శవము'ను ఆశ్రయిస్తున్నాడేగాని, అణకువ అనే 'శివము'ను ఆశ్రయించడం లేదు.

**పరుల మెప్పు కాదు, ఆత్మతృప్తి ప్రధానం**

'సత్యం జనవిరోధాయ అసత్యం జనరంజనం'. జనులను రంజింప జేయాలని అందరూ అసత్యమాడుతున్నారు. అసత్యంచేత జనులను రంజింపజేయవచ్చునేమోగాని, హృదయాన్ని రంజింపజేయడానికి వీలౌతుందా? ఈనాటి మానవుడు జనుల మెప్పుకోసం పాటుపడుతున్నాడే గాని, ఆత్మతృప్తికోసం పాటుపడటం లేదు. ఎలాంటి పరిస్థితియందైనా అసత్యమాడకూడదు. "నేను మానవునిగా పుట్టాను. కాబట్టి, నేను సత్యమునే చెప్పాలి. అసత్యానికి, అన్యాయానికి పాల్పడకూడదు", అనే దృఢదీక్షను కల్గియుండాలి. ఒక్కొక్కసారి సత్యము చెప్పడంవలన ప్రాణాపాయము సంభవించే పరిస్థితి ఏర్పడవచ్చు. అలాంటి సమయంలో సత్యమూ చెప్పవద్దు, అసత్యమూ చెప్పవద్దు. మౌనంగా ఉండాలి. యుక్తిని ఉపయోగించి సత్యాన్ని కాపాడుకోవాలి. సత్యవాక్పరిపాలకుడైన ఒక సాధకుడు అరణ్యంలో ఒక చెట్టు క్రింద కూర్చుని "ఓం నమశ్శివాయ" అంటూ శివపంచాక్షరీ మంత్రాన్ని జపిస్తున్నాడు. ఈశ్వరుడు అతనిని పరీక్షించగోరి ఒక వేటగాని వేషంలో ఒక జింకను తరుముకుంటూ వచ్చాడు. ఆ జింక పరుగెత్తుకుంటూ వచ్చి ఒక పొదలోకి దూరింది. ఈ దృశ్యాన్ని ఆ సాధకుడు చూశాడు. ఇంతలో వేటగాడు వచ్చి "ఓ తపస్వీ! నేను తరుముకుంటూ వచ్చిన జింక ఇటువైపుగా వచ్చింది. అది ఎటు వెళ్ళిందో మీరు చూశారా?" అని అడిగాడు. ఈ సాధకునికి ధర్మసంకటం ఏర్పడింది. చూడలేదని చెబితే తన సత్యవ్రతానికి భంగం కల్గుతుంది. చూశానని చెబితే ఆ జింక ప్రాణం పోతుంది. ఈ సమస్యనుండి బయట పడటానికి మార్గం చూపించమని ఈశ్వరుణ్ణే ప్రార్థించాడు. అడిగిన తక్షణమే ఇచ్చే భగవంతుడు మన ఇంటనే, వెంటనే, జంటనే ఉండగా మనకు భయమెందుకు?! ఈశ్వరుని కృపచేత అతనికొక చక్కని ఉపాయం తట్టింది. వెంటనే ఆ వేటగానితో "నాయనా! ఏది చూచెనో అది పలుకదు. ఏది పలుకునో అది చూడలేదు' అన్నాడు. కన్నులు చూచినాయిగాని, చెప్పలేవు. నోరు చెప్పగలదుగాని అది చూడలేదు. ఈరీతిగా ఆ సాధకుడు యుక్తిని ఉపయోగించి తప్పించుకున్నాడు. ఈశ్వరుడు ప్రత్యక్షమై "నాయనా! సత్యాన్ని కాపాడే యుక్తికూడా యోగమే", అన్నాడు. ఇట్టి యుక్తిచేత మనము సత్యాన్ని పోషించుకోవాలి. దైవప్రార్థనచేత కష్టాలనుండి తప్పించుకోవాలి.

**నీతినిజాయతీలే మానవజాతికి ప్రాణములు**

సర్వులకు ఉపకారం గావించే సద్భావములను పెంచుకోవాలి. ఎవ్వరికీ అపకారం చేయకూడదు. నీవొకరికి అపకారం చేశావంటే, రేపు నీకు పదిమంది అపకారం చేస్తారు. కాబట్టి, ఎవ్వరికీ ద్రోహం తలపెట్టవద్దు, ఎవ్వరినీ దూషించవద్దు. ప్రవృత్తికి సంబంధించిన నెగెటివ్ లక్షణాలను త్యజించి నివృత్తికి సంబంధించిన పాజిటివ్ లక్షణాలను పెంచుకోవాలి. ప్రజ్ఞాన విజ్ఞాన సుజ్ఞానములతో కూడిన మానవజన్మను పొంది పశువులవలె అజ్ఞానంలో మునిగిపోవడం మంచిది కాదు. అష్టాదశ పురాణాల సారాన్ని వ్యాసుడు ఒక్క మాటలో చెప్పాడు – "పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం." ఇదే ముఖ్యంగా మీరు నేర్చుకోవలసింది. సాధ్యమైనంతవరకు ఇతరులకు బాధ కల్గించకుండా చూసుకోవాలి. ఒకవేళ మీకు బాధ కల్గుతుందా, ఫరవాలేదు. మీ బాధను భగవంతుడు తప్పిస్తాడు. ప్రతి మానవునియందు మాధవత్వమున్నది. మీలో ఉన్న మాధవత్వాన్ని విస్మరించి క్రూరత్వానికి పూనుకుంటే మీరు మానవులెట్లవుతారు? మీరు మొట్టమొదట మానవులుగా ప్రవర్తించండి. మీ జాతి మానవజాతి. నీతినిజాయతీలే మానవజాతికి ప్రాణములు. "నీతి కల్గు జాతి నిజమైన జాతిరా". కాబట్టి, నీతినిజాయతీలను పోషించుకోవాలి.

**ఏకత్వాన్ని గుర్తించడమే ఆధ్యాత్మికం**

సర్వ జీవులయందున్న ఈశ్వరత్వము ఒక్కటే అనే సత్యాన్ని తెలుసుకోవడమే భారతీయులయొక్క ప్రధాన ధర్మం. అనేకత్వంలోని ఏకత్వాన్ని నిరూపించడమే భారతీయసంస్కృతియొక్క ప్రధాన లక్ష్యం. 'నీవు వేరు, నేను వేరు' అని భావించకూడదు. తన, పర అనే భేదములకు చోటివ్వకూడదు. కాని, మీరు అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించక ఏకత్వాన్ని అనేకత్వంగా విభజిస్తున్నారు. ప్రేమస్వరూపులారా! మొట్టమొదట "నేనెవరు?" అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. "నేను" అనేది అందరిలోనూ ఉన్నది. ఈ ప్రపంచంలో అందరూ "నేను" అని అంటున్నారు. ఇంతమందిని తెలుసుకోవడానికి మీకు సాధ్యమౌతుందా? మీలో ఉన్న 'నేను'ను తెలుసుకుంటే మీరు అందరినీ తెలుసుకున్నవారౌతారు. "నేను ఆత్మను" అని తెలుసుకున్నప్పుడు అందరూ ఆత్మస్వరూపులే అని అర్థ మౌతుంది. ప్రతి మానవునియందు పశుత్వమున్నది. మొట్టమొదట దానిని చంపుకోవాలి. మీలోని పశుత్వాన్ని నిర్మూలించుకొని మీ మానవత్వాన్ని దివ్యత్వంగా మార్చుకోవడమే ఆధ్యాత్మికం. ఆత్మసంబంధమే ఆధ్యాత్మికం. నీవు, నేను ఒక్కటే అనే ఏకత్వాన్ని గుర్తించడమే ఆధ్యాత్మికం. దూషణకు కృంగకూడదు, భూషణకు పొంగకూడదు.

ధర్మరాజు శ్రీకృష్ణునికి అగ్రతాంబూలమునందించినప్పుడు శిశుపాలుడు లేచి కృష్ణుణ్ణి ఇష్టమొచ్చినట్లు దూషించడం మొదలుపెట్టాడు. అగ్ర తాంబూలమును అందుకోవడానికి కృష్ణునికి అర్హత లేదన్నాడు. "*కృష్ణా! స్నానంబు చేయు ఆ జవరాంద్ర చీరలు కాజేసి నందుకా పూజ నీకు? గొల్లపూబోండ్లతో జల్లులాడిననాడు హర్షించి నందుకా అర్ఘ్యమిడుట? చాలునిక, కట్టిపెట్టు పంచాంగమింక. పొగడుకొనబోకు, చాలించు, మూయి నోరు*" అన్నాడు. నిండుసభలో ఈరీతిగా కృష్ణుణ్ణి దూషిస్తుంటే ధర్మజుడు చాలా బాధపడ్డాడు. కృష్ణుని పాదాలపై పడి "ఈ దుర్మార్గుడు దూషిస్తుంటే మీరు చిరునవ్వులు చిందిస్తున్నారుగాని, నాకు మాత్రం చాలా దుఃఖంగా ఉంది," అన్నాడు. అప్పుడు కృష్ణుడు "పిచ్చివాడా! దూషణ భూషణ తిరస్కార పురస్కారములన్నీ దేహమునకేగాని, ఆత్మకు కాదు. వీటికి మనం ఎందుకు లొంగాలి? ఈ పాడు దేహానికి అనేక రోగాలు వస్తున్నాయని మన దేహాన్ని మనమే నిందించుకుంటాము. అలాంటప్పుడు ఇతరులు మన దేహాన్ని దూషించినప్పుడు వారు మనకు సహాయమే చేసినవారౌతారు కదా!" అన్నాడు.

'మౌనాత్ కలహం నాస్తి', మౌనంగా ఉంటే కలహాలు సంభవించవు. ఎవ్వరినీ దూషించవద్దు. ఎవ్వరికీ అపకారం చేయవద్దు. వారు చేస్తే చేశారు, నీవు మాత్రం చేయవద్దు. వారు చేసిన పనే నీవు చేస్తే నీవు వారికంటే

అధికుడవు ఎట్లు కాగలవు? వారు చేసింది తప్పు అంటున్నావు. నీవు తిరిగి వారికి అపకారం చేస్తే నీవు చేసినది మాత్రం రైటు అవుతుందా? కనుక, నీవు ఎవ్వరికీ అపకారం చేయవద్దు. అపకారం చేసినవారికికూడా నీవు వందనాలు తెలియజేయి. "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు" అని అందరి క్షేమాన్ని కోరుకో. సర్వులూ సుఖంగా ఉన్నప్పుడే నీకు సుఖం ప్రాప్తిస్తుంది. అందరి సుఖాన్ని కోరుకుందాము, అందరి క్షేమాన్ని ఆశిద్దాము. ఈ లోకంలో ఎవ్వరూ మనకు ద్వేషులు లేరు. అందరినీ మిత్రులుగా భావించు. అప్పుడే నీవు ప్రపంచానికి ఆదర్శవంతమైన జీవితాన్ని అందించినవాడవౌతావు. దీనికోసమే భగవంతుడు నిన్ను సృష్టించాడు. నీకిష్టమైన పని చేసుకోవచ్చు. కాని, హృదయాన్ని మాత్రం భగవంతునికి అర్పితం చేయి.

**ఏ హృదయంబు నొసంగితివొ ఈశ నాకు**
**మగిడి దానినే అర్పింతు మహితమూర్తి**
**పరగ వేరేమి దెత్తు నీ అర్చనకును**
**అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు**

"భగవంతుడా! నీవు ఇచ్చిన హృదయాన్ని తిరిగి నీకే అర్పిస్తున్నాను. నీకు ఇవ్వడానికి నాదగ్గర క్రొత్త వస్తువేదీ లేదు. నావద్ద అన్నీ నీవిచ్చినవే ఉన్నాయి. నీవు ఇచ్చినవే నీకు అర్పిస్తున్నాను," అనే భావంతో అర్పించాలి. భగవంతుడు నీకందించిన ప్రేమను నీవు తిరిగి పదిమందికి పంచాలి. ద్వేషము, అసూయ, క్రోధము – ఈ మూడు దుర్గుణాలు ఎవనియందు నిండియుంటాయో అట్టి వానిని భార్య, పిల్లలుకూడా పలుకరించరు. కనుక, ఈ దుర్గుణాలను దూరం చేసుకోవాలి. ప్రేమను పెంచుకుంటే ఈ దుర్గుణాలు సహజంగానే దూరమైపోతాయి. మానవుడు పుట్టినప్పుడు పవిత్రమైన హృదయం కల్గియుంటాడు. కాని, పెరుగుతూ పెరుగుతూ పెద్దబావ కోతి అయినట్లుగా దుర్గుణాలన్నింటినీ పెంచుకుంటాడు. దుర్గుణాలు తాను చేర్చుకున్నవేగాని, అవి సహజమైనవి కావు. మానవత్వం ఎంత పవిత్రమైనది! ఎంత దివ్యమైనది! ఎంత భవ్యమైనది! ఎంత సున్నితమైనది! ఇట్టి మానవత్వాన్ని ఎందుకు పాడుచేసుకుంటారు? స్వార్థస్వప్రయోజనాలకోసం ఇతరులను నొప్పించడం మంచిది కాదు. పరులయొక్క సుఖాన్ని చూసి నీవు ఆనందించు. అప్పుడే నీ ఆనందం రెట్టింపు అవుతుంది. ఆత్మానందమును, చిదానందమును అందించేవాడు శంకరుడు. అట్టి శంకరుణ్ణి హృదయంలో నిల్పుకొని ఆత్మానందాన్ని, బ్రహ్మానందాన్ని, నిత్యానందాన్ని, పరమానందాన్ని, అద్వైతానందాన్ని అభివృద్ధిపరచుకోవాలి. నీవు మానవునిగా పుట్టి దీనునిగా బ్రతకకూడదు. పరులను హింసించడం క్రూరత్వం. నీవు పరులను హింసిస్తే క్రూర మృగానివైపోతావు. పరులకు భయపడితే నీవు పశువుగా మారిపోతావు. నీవు మృగము కాదు, పశువు కాదు. నీవు మానవుడవు. కాబట్టి, నీవు పరులను బాధించకూడదు. పరులకు నీవు భయపడకూడదు.

### చావు లేని చదువు చదువవలయు

నీవేది సంకల్పించినా భగవంతుడు "తథాస్తు! తథాస్తు!" అని దీవిస్తుంటాడు. నీవు చెడ్డ సంకల్పం చేస్తే దానికికూడా "తథాస్తు" అని అంటాడు. ఆ చెడ్డ ఫలితం నీకే వస్తుంది. నేడు కాకపోయినా మున్ముందు అది బాధపెడుతుంది. కనుక, నీవు బాధపడకుండా, పరులను బాధ పెట్టకుండా ఆనందంగా జీవించాలి. అందరినీ గౌరవించాలి. అప్పుడే మనలను అందరూ గౌరవిస్తారు. ప్రేమనందించి ప్రేమను పొందాలి. ఇట్టి సద్గుణాలను పోషించుకునే నిమిత్తమై మన చదువులను చక్కచేసుకోవాలి.

**చదువులన్ని చదివి చాల వివేకియై**
**మదిని తన్నెఱుగడు మందమతుడు**

ఎంత చదువు చదివి ఏరీతి నున్నను
హీను దవగుణంబు మానలేడు
తరచి చదువు చదువ తర్కవాదమెకాని
పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు
చదువులన్నియు చదివి చావంగ నేటికి?
చావు లేని చదువు చదువవలయు

ఈ లౌకికమైన చదువులన్నీ నెగెటివ్ చదువులే. చదువుకున్నవాని కంటే చాకలివాడు మేలంటారు. మనం చాకలివానికి బట్టలు వేస్తే ఆ లిస్టును ఒక నోట్‌బుక్కులో వ్రాసుకుంటాము. లేకపోతే గోడమీదైనా వ్రాస్తాము. చాకలివాడు మాత్రం తనకు ఎవరు ఏ బట్టలు వేశారనే లిస్టును ఎక్కడా వ్రాసుకోడుకాని, ఎవరు వేసిన బట్టలు వారికి కరెక్టుగా తెచ్చిస్తాడు. తాను ఏ చదువు చదివాడు?! కాబట్టి, ఈ లౌకికమైన చదువులతో మనం తృప్తిపడకూడదు. వీటితోపాటు పాజిటివ్ చదువులుకూడా చదవాలి. పరోపకార సంబంధమైన చదువులు చదవాలి. అప్పుడే మనం పవిత్రులమైపోతాము.

**శాంతి బయట లేదు, మీలోనే ఉన్నది**

మన ప్రాచీనులు ప్రకృతిని ఆరాధన చేస్తూ వచ్చారు. మనం తినే తిండిని, త్రాగే నీటిని ప్రకృతియే మనకు అందిస్తున్నది. భూదేవియే పంటలను పండిస్తున్నది; బంగారము, వెండి ఇత్యాది విలువైన లోహములను అందిస్తున్నది. మనకు ఇంతగా తోడ్పడుతున్న భూమిని ఆరాధించడంలో తప్పేమున్నది? సర్వప్రాణులను సంరక్షించే పంచ భూతములను పూజించడంలో తప్పేమున్నది? భూమాత, గోమాత, వేదమాత, దేహమాత... ఈ నల్గురినీ మనం ఆరాధించాలి. అన్నింటికీ దైవారాధన చాలా ముఖ్యం. ఈనాడు దైవారాధన సన్నగిల్లడంచేతనే ప్రపంచంలో దుఃఖం పెరిగిపోతున్నది. ప్రజలు ఆత్మవిశ్వాసమును కోల్పోతున్నారు. ఆత్మవిశ్వాసం లేని మానవుడు బ్రతికీ ప్రయోజనమేమిటి? దైవారాధనయే దేశాన్ని రక్షిస్తుంది. దైవారాధన చేస్తే దేశమంతా బాగుపడుతుంది. తిండితీర్థాదులకు లోటుండదు. ప్రజలంతా సుఖశాంతుల ననుభవిస్తారు. మనం "శాంతి శ్శాంతి శ్శాంతిః" అని ఉచ్చరించడంలో అంతరార్థ మేమిటి? ఆధిభౌతికము, ఆధిదైవికము, ఆధ్యాత్మికము - ఈ మూడింటియందు మనకు శాంతి కావాలి. దేహరీతిగా, మానసికరీతిగా, ఆత్మరీతిగా మనకు శాంతి కావాలి. శాంతిని ఈ ప్రపంచంలో వెతికితే మనకు చిక్కదు. ఈ ప్రపంచంలో ఎక్కడ చూసినా Pieces తప్ప Peace కనిపించదు. Peace మీలోనే ఉంది. మీలో ఉన్న శాంతిని మీరు పోషించుకోండి. ఈ రాత్రంతా చక్కగా నామ స్మరణ చేసి ఈ పవిత్రమైన శక్తిని ప్రపంచానికంతటికీ ప్రసరింపజేయండి.

**(తేది: 12.03.2002 సాయంత్రం సాయికుల్వంత్ సభా మండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశమునుండి)**